క్లుప్తంగా

29న మండల సర్వసభ్య సమావేశం

కె.కోటపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం జరగనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులతోపాటు సర్పంచ్, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

28న గురుకులం మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

- దరఖాస్తుల స్వీకరణకు రేపటి వరకు గడువు


ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

దేవరాపల్లి: తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో 2024–2025 విద్యా సంవత్సరంలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 28న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్ సోమవారం తెలిపారు. స్థానిక గురుకుల విద్యాలయంలో 6, 7, 8, 9 తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు. ప్రవేశ పరీక్ష 28న ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, గంట ముందుగా హాజరు కావాలన్నారు. పరీక్షకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు జెరాక్స్, బ్లూ లేదా, బ్లాక్ పెన్ మాత్రమే తీసుకురావాలని సూచించారు.

చెరువుల్లో జలకళ


నిండుగా ఎర్రవరం చెరువు

గొలుగొండ: మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఈ కారణంగా దారగెడ్డ, బోరింగ్ గెడ్డ, బొడ్డేరు నుంచి వర్షం నీరు భారీ ప్రవహిస్తోంది. ప్రధానంగా ఎర్రవరం, పాలకపాడు, గుండిపాల, ఏఎల్‌పురం చెరువులు పూర్తిగా నిండిపోయాయి. ఈ చెరువుల కింద 500 ఎకరాల్లో సాగు భూములు ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ముందుగానే చెరువులు నిండిపోవడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాతమల్లంపేటలో విష జ్వరాలు

గొలుగొండ: పాత మల్లంపేట పంచాయతీలో మూడు రోజుల నుంచి విష జ్వరాల తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ శివారు బుడ్డడపాడు, చంద్రయ్యపాలెం, పోలవరం, నిమ్మగెడ్డ, అచ్చియ్యపేట తదితర గ్రామాలు కొండ ప్రాంతాలకు ఆనుకుని ఉండటం వల్ల దోమల విజృంభిస్తున్నాయి. తద్వారా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ విషయంపై గొలుగొండ వైద్యాధికారి శ్యామ్‌ను సంప్రదించగా ఇప్పటికే రెండుసార్లు మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామని, దోమలు అధికంగా ఉండటం వల్ల జ్వరాలు వస్తున్నాయని వెంటనే మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

వైద్య చికిత్సలకు రోగుల తరలింపు


వైద్య చికిత్సలకు ఎంపికైన రోగులు

మాడుగుల రూరల్: విశాఖ సమీపంలో సంగినవలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి సోమవారం కె.జె.పురం నుంచి రోగులను తరలించారు. గ్రామంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులను ఆస్పత్రి సిబ్బంది గుర్తించారు. ఈ మేరకు భానోదయ రూరల్ డెవలప్‌మెంటు సొసైటీ ఆధ్వర్యంలో కె.జె.పురం నుంచి 17 మందిని, వంటర్లపాలెం నుంచి నలుగురు రోగులను ప్రత్యేక బస్సులో తరలించారు. సంస్థ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సూర్యనారాయణ, పక్కన ఎంపీడీవో సుబ్బలక్ష్మి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

ఎంపీడీవోలు సుబ్బలక్ష్మి, రాంబాబు
ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సూర్యనారాయణ

దేవరాపల్లి: గ్రామాల్లో డయేరియా ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, మాడుగుల ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో సుబ్బలక్ష్మి అధ్యక్షతన పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులతోపాటు మంచినీటి ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ పనులు చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా మంచినీటి సరఫరా చేసే పైపులు లీకేజీలు లేకుండా చూడాలని సూచించారు. ఇళ్ల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడటంతో పాటు దోమల వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి మండల పంచాయతీ విస్తరణాధికారి జి. సంతోషి నళిని, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె. చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితర్లు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

విద్యతోపాటు విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం

నాతవరం: విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. మండల స్థాయి హెచ్‌ఎంలతో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఇటీవల పలు ప్రాంతాల్లో డయేరియా అధికంగా వస్తుందని, దానిని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు స్థానిక వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వేడి నీళ్లు తాగించడం, తాగునీటి వనరులను క్లోరినేషన్ వంటి పనులు చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పలు సూచనలు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందించే బాధ్యత ఎంఈవోలతోపాటు ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. వారి సూచనలు, సలహాల మేరకు పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు. మారుమూల పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఎంఈవోలు తాడి అమృత్ కుమార్, కామిరెడ్డి వరహాలబాబు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు వరి విత్తనాల పంపిణీ


రైతులకు వరి విత్తనాలందిస్తున్న సర్పంచ్ దేముళ్లు, ఎంపీటీసీ దేముడుబాబు


ఎం. కోడూరు ఆర్బీకేలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సంజీవిరావు

కె.కోటపాడు: ఖరీఫ్‌లో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి మంచి దిగుబడితో కూడిన పంట పొందాలని సర్పంచ్ బండారు దేముళ్లు తెలిపారు. సోమవారం గుల్లేపల్లి ఆర్బీకేలో రైతులకు వరి విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణాధికారి లైలాదేవి మాట్లాడుతూ గుల్లేపల్లిలో 120 మంది రైతులకు సాంబమసూరి, ఆర్జీఎల్, సోనామసూరి, శ్రీధృతి రకం వరి విత్తనాలు ఐదు టన్నులను రాయితీపై అందించినట్లు తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు సాగు సూచనలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ కశిరెడ్డి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎం. కోడూరులో..

మాడుగుల రూరల్: ఎం. కోడూరు రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ వరి విత్తనాలు పంపిణీని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు సోమవారం ప్రారంభించారు. ఇక్కడ కేంద్రానికి 186.04 టన్నుల విత్తనాలు వచ్చాయి. స్థానిక వ్యవసాయ సహాయకురాలు వి. కమల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, ఉప సర్పంచ్ గెంజి రాజేశ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అప్పాన భాస్కరరావు పాల్గొన్నారు.

పరదేశమ్మ తల్లి ఒడ్డు పండగ నేడు


ప్రత్యేక అలంకరణలో పరదేశమ్మ తల్లి

దేవరాపల్లి: శంభువానిపాలెంలో గ్రామ దేవత పరదేశమ్మ తల్లి ఒడ్డు పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అమ్మ వారి పండగను పురస్కరించుకుని గ్రామస్తులు తెల్లవారు జాము నుంచి దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం సాయంత్రం ఆధ్యాత్మిక కార్య క్రమాలతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ

మాడుగుల: 17వ విడత పీఎం కిసాన్ డబ్బులు జమకాని రైతులు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు తెలిపారు. మండలంలో 2023- 24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి మండలంలో 869 మంది రైతులు ఈకేవైసీ చేసుకోలేదన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి డబ్బులు పడని రైతులు సంబంధిత ఆర్బీకేల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

వరి విత్తనాల కోసం ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్

రోలుగుంట: మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాల కోసం రైతులు మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. ఆర్బీకేల్లో సోనామసూరి, ఇంద్ర, మార్టేరు సాంబ, స్వర్ణ, నెల్లూరి సన్నాలు, ఆర్జీఎల్, 1318 రకాలు మొత్తం 687 క్వింటాళ్ల అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుకు కావాల్సిన వరి రకానికి సంబంధించి తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జెరాక్సుతో రిజిస్ట్రేషను చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు తమ సమీప ఆర్బీకేలను సంప్రదించాలని సూచించారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 4 వినతులు

మాకవరపాలెం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నాలుగు వినతులు అందాయని తహసీల్దార్ మురళీమోహనరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన వారు రెవెన్యూ సమస్యలపై నాలుగు వినతులను అందజేశారన్నారు. వీటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ తహసీల్దారు శంకర్ పాల్గొన్నారు.

అంతంతమాత్రంగానే ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ప్రజల నుంచి అంతంతమాత్రంగానే స్పందన వచ్చింది. డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయి. ఆర్డీవో హెచ్.వి.జయరాం తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయం, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు చేశారు. ఇంటికి వెళ్లే రహదారిని అక్రమించారని మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి నివాసి చంద్రయాణి ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్లో భూమి వివరాలు తొలగించారని రోలుగుంట మండలం కోమరవోలుకు చెందిన కామిరెడ్డి వరహాలమ్మ ఫిర్యాదు చేసింది. ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో మండల స్థాయి అధికారులను ఆదేశించారు.

ప్రమాదకరంగా వెదురుపొంతలు


నర్సీపట్నం - తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వాలిన వెదురుపొంతలు

నాతవరం: నర్సీపట్నం– తుని మధ్య పెడిమికొండ అటవీ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి ఎత్తయిన వెదురుపొంతలు వాలిపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాండవ జంక్షన్ నుంచి గాంధీనగరం మధ్య మూడు కిలో మీటర్ల పొడవునా రోడ్డుపై వెదురుపొంతల కొమ్మలు వేలాడుతున్నాయి. ఇవి వచ్చిపోయే వాహనదారుల ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డు ఆర్‌అండ్‌బీ శాఖది వెదురుపొంతల చెట్టు కొమ్మలు అటవీ శాఖ పరిధిలోకి వస్తాయి. తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా ఈ రెండు శాఖల అధికారులు వాటిని తొలగించే ప్రయత్నం చేయలేదు. తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రాత్రిళ్లు ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునేటప్పుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురవుతున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు శృంగవరం సర్పంచ్ ఉలబాల శ్రీను, గాంధీనగరం సర్పంచ్ పాతాళ అప్పారావు అధికారులు దృష్టికి తీసువెళ్లారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల ద్విచక్ర వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా పోలీసు, అటవీ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు.

ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దందాపై ఎస్ఎఫ్ఐ ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనకాపల్లి: ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనల ఉల్లంఘనలపై జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని, విద్యార్థుల ఫీజు వివరాలను పాఠశాల ఆవరణ నోటీస్ బోర్డులో నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎస్. రమణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అనకాపల్లి డివిజన్ పరిధిలో 50 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఆయా యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఏటా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఫీజుల రూపంలో అడ్డగోలుగా రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆక్షేపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ఎం.రమేష్, నాయకులు ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన


మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూర్యప్రకాశరావు

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశరావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని ఏఎంఏఎల్ కళాశాల ఆవరణలో అంతర్జాతీయ మాదక ద్రవ్య వినియోగ, రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువుపై ధ్యాస పెట్టడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఖాళీ సమయంలో లైఫ్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


వి.సంతపాలెంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: వాతావరణ మార్పులతో ప్రజలకు వ్యాధులు సోకే పరిస్థితులు ఉంటాయని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. సోమవారం వి.సంతపాలెంలో మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు డెంగ్యూ, మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. పాత టైర్లు, రోళ్లు, మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రమాదకర జ్వరాల బారిన పడతారని వైద్యాధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్‌ఎం మంగ, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లిలో పాము హల్‌చల్

స్నేక్ క్యాచర్‌ను రప్పించి పట్టివేత


పాముపై నీళ్లు పోస్తున్న స్నేక్ క్యాచర్

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో నాగుపాము జనావాసాల్లోకి ప్రవేశించడంతో స్థానికులు హడలిపోయారు. దారపు సూరిబాబుకు చెందిన ఇంటి నిర్మాణం వద్ద మరుగుదొడ్డి గొయ్యిలోకి నాగుపాము ప్రవేశించింది. ఇంటి నిర్మాణ పనులు చేసేందుకు సోమవారం ఉదయం అక్కడకు వచ్చిన కూలీలను చూసి బుసలు కొట్టడంతో వారంతా భయంతో పరుగులు తీశారు. స్థానికులు కొందరు నాగుపామును బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో వేపాడకు చెందిన స్నేక్ క్యాచర్ కృష్ణకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని దాన్ని అతి కష్టం మీద పట్టుకుని బయటకు తీసి అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


సమావేశంలో ఎంపీపీ రాజారామ్, అధికారులు

మాడుగుల ఎంపీపీ రాజారామ్

మాడుగుల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడు అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ఆదేశాల మేరకు గ్రామాల్లో మంచినీటి పథకాలు వారానికి ఒకసారి శుభ్రం చేయాలన్నారు. వర్షాకాలంలో డయేరియా రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడానికి పంచాయతీ సిబ్బంది, సర్పంచ్‌లు బాధ్యత తీసుకోవాలని కోరారు. గ్రామాల పరిశుభ్రత విషయంలో ప్రతి పౌరుడు శ్రద్ధ పెట్టాలన్నారు. కాచి చల్లార్చిన నీటి తాగడం వల్ల జ్వరాలు రాకుండా కాపాడుకోవచ్చునని వైద్యాధికారి ప్రసాద్ పాత్రుడు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి బి. దేముడమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నరసింగరావు, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలతో స్వీపింగ్ పనులు తగదు

పెదగోగాడ వైద్యసిబ్బంది తీరుపై
సీఐటీయూ కార్యదర్శి ఆగ్రహం


సచివాలయంలో గచ్చు ఊడుస్తున్న చుక్కపల్లి ఆశ కార్యకర్త

చీడికాడ: ఆశ కార్యకర్తలను చిన్నచూపు చూస్తే ఆందోళనకు దిగుతామని సీఐటీయూ డివిజన కార్యదర్శి ఆర్.దేముడునాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెదగోగాడ ఆస్పత్రి పరిధి చుక్కపల్లి ఆశ కార్యకర్తలతో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లలో స్వీపింగ్ పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. వీరి జాబ్ చాట్ ప్రకారం ఇటువంటి పనులు ఉండవన్నారు. వీరిని భయపెట్టి స్వీపింగ్ పనులు చేయిస్తున్నారన్నారు. గతంలో ఇదే విధంగా ఇబ్బందులు పెడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశామన్నారు. అయినా పెదగోగాడ వైద్యాధికారులు, సిబ్బంది తీరులో మార్పు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇటువంటి వెట్టిచాకిరీ పనులు చేయించకుండా చూడాలని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

మెగా డీఎస్సీలో ప్రత్యేక పోస్టులు భర్తీ చేయాలి

కాంగ్రెస్ పార్టీ చోడవరం నియోజకవర్గ
ఇన్‌చార్జి జగతా శ్రీనివాసరావు



చోడవరం రూరల్: ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను 2024 మెగా డీఎస్సీలో భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జగతా శ్రీనివాసరావు కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు మొదటి సంతకం చేసి మెగా డీఎస్సీ అమలు చేస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందులో 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను విస్మరించిందన్నారు. దివ్యాంగుల కోటాలో 6,800 పోస్టులు భర్తీ చేయుటకు సీఎం చంద్రబాబునాయుడు పునరాలోచన చేయాలని కోరారు. రాష్ట్రంలో లక్షా 20 వేల డీఎస్సీ పోస్టుల్లో దివ్యాంగుల కోటా భర్తీ చేయాలని సుప్రీం తీర్పు ఇచ్చిందన్నారు. 2018–19లో 600 మంది ప్రత్యేక ఉపాధ్యాయులుగా నియమితులయ్యారన్నారు. తాజాగా మెగా డీఎస్సీలో ఈ పోస్టులు భర్తీ చేసి న్యాయం చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళనకు విరామం


పారిశుధ్య కార్మికుల సమస్యలపై చర్చలు జరుపుతున్న పంచాయతీ కార్యదర్శి రమేష్

కశింకోట: స్థానిక పంచాయతీ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికుల ఆందోళన కార్యక్రమం సోమవారం తాత్కాలికంగా వాయిదా పడింది. గత మూడు రోజులుగా తమకు రావలసిన వేతన బకాయిల కోసం విధులను బహిష్కరించి ధర్నాలు, ర్యాలీలతో నిరసన తెలుపున్న విషయం తెలిసిందే. పంచాయతీ కార్యదర్శి రమేష్, కూటమి ప్రతినిధులు, సీఐటీయూ నాయకులు సమస్య పరిష్కారానికి పారిశుధ్య కార్మికులతో చర్చించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27న రెండు నెలల వేతన బకాయిలు చెల్లించేందుకు, మిగిలిన మూడు నెలల బకాయిల్ని రెండు మాసాల్లోగా చెల్లించేందుకు హామీ ఇచ్చారు. దీంతో పారిశుధ్య కార్మికులు సమ్మెను తాత్కాలికంగా విరమించారు. విధులకు హాజరై చెత్త తొలగింపు పనులు చేపట్టారు. ఈ చర్చల్లో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఏపీ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) స్థానిక అధ్యక్షుడు కె.రామంజి, తదితరులు పాల్గొన్నారు.